# మహానుభావులారా....

రచన:
శ్రీ డి. శ్రీనివాసరావు

["ఇహలోకంతో సంబంధంలేకుండా పరలోకధ్యాసచేసి పరమేశ్వర సాన్నిధ్యంపొందే పరమ పవిత్రులైన, తత్వజ్ఞానులైన మిమ్మల్ని యీ మా పాపిష్టి ప్రపంచంలోకి తీసుకొచ్చాం. మాకు ముక్తిమార్గం చూపించరూ? మమ్మల్ని విడిచి వెళ్ళిపోతారా? మమ్మల్ని మరచిపోతారా?" అంటూ మహానుభావుల స్వభావానికి నిరుపేద వాపోతున్నాడు. ఆతని ఆక్రందనలు ఈ కథలో వినిపించబడినాయి.]

❀

మా ప్రపంచములోకి రమ్మని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. మమ్మల్ని ఓసారిచూచి పోండి. మా కష్టసుఖాలు గమనించమని ప్రార్థన. ఇలా రండి. ఇదీ దోవ. రాజమార్గాల్లో నడిచిన మీ సుకుమార పాదాలకు యీ రాళ్ళ బాటని చూపిస్తున్నాం. కష్టపడుతున్నాయి కాబోలు క్షమించాలి. రాజప్రాకారాల్లో రమణీయ భవనాల్ని తిలకించిన మీ దివ్యనేత్రాలు మా దురదృష్టవంతుల చుట్టు గుడిసెలు, చికాకుతో నిండిన చిన్నగొందులను చూడనిచ్చగించవేమో! మన్నించాలి. విహార స్థలాలు, ఉద్యానవనాల మాట అటుంచి యిరుగు పొరుగు కూర్చునేందుకు అరుగు వేసుకునే వీలులేని యిరుకైన స్థలాల్లో ఒకదాని ప్రక్కనొకటి యిరుక్కొనివున్న యిళ్ళని వీక్షించండి. కుషన్ కుర్చీలమీద సుఖంగా కూర్చునే మీబోటి పెద్దలకి యీ పంచ పక్కనవున్న నులకకుక్కి మంచం మీద కూర్చోమనేందుకు సిగ్గుపడుతున్నాం. మీరు రాజపూజితులు. మిమ్మల్ని ధనవంతులు ఆదరిస్తారు. పంచబక్ష్య పరమాన్నములు, ఫలహారములు మీకు సమర్పిస్తారు. పానీయాలు సేవించే మీకు మంచినీళ్ళకు మించి యివ్వలేని బహుపేదలం మేము. అత్తరు సువాసనలు, కస్తూరి ఘుమ ఘుమలు, యింపుగ అలంకరించిన గదులు మిమ్ములను ఉత్సాహపూరితుల జేయ, ఉల్లాసముగ వింతల్ని విమర్శించే మిమ్మల్ని మురికివాసనలు వెదజల్లే కుళ్ళు కాలవలు, పెంట పోగులతో నిండిన పరిసర ప్రదేశాన్ని, వరుణ సూర్య చంద్రాదుల రాకపోకలకు నిరాటంకమైన యీ నిర్భాగ్యుల గుడిసెలని పరీక్షించమన్నందుకు కినుక జెందకండి.

అందాల బిళ్ళోరి అద్దాలు, రంగు రంగులతో వ్రాయబడిన సుందరాంగనల చిత్రాలు, ప్రకృతిశోభని సూచించే పటాలు, నవనాగరీకతను కనబరిచే నానా విధ సామాగ్రితో నిండిన సౌధాల్లో సుఖజీవనం చేసె శ్రీమంతుల సరిని సంతోషంతో కాలాన్ని గడుపుతూ సన్మానాలు పొందే కవి సామ్రాట్టులయిన మీ యెదుట కూలి కొంపలు, కాయకష్టం చేసి పంటలు పండించి కామందుల యిండ్లలో పురులు కట్టే మాతనువులు, కోతకోసే మా కొత

వళ్ళు, సమ్మెటకొట్టే మాసుత్తులు. కర్మాగారల్లో పనిచేసే మాపరికరాలు, భాగ్యవంతులుభవనాన్ని కట్టే మా పనిముట్లు కనిపిస్తున్నాయి. నాటి రాజుల రథగజ తురగపదాతులు, మహారాజుల మాణిక్యరాసులు, పురాణేతిహాసాలు, నేటి ప్రభువుల గౌరవోద్యోగాలు, భాగ్యవంతుల బిరుదులు యిత్యాదులువర్ణించే కవివరేణ్యులయిన మీసమక్షాన తిన తిండి, కట్టుబట్ట లేక కలకాలం కష్టపడే కార్మిక కర్షకులు నిలుచున్నాం.

గాయక శిఖామణులారా! మీప్రేమ గానాన్ని, విరహగీతికల్ని విన నింపుగల్గించే వివిధ వాయిద్యాలకు బదులు "అమ్మా ఆకలే" అనే పసిపాపాల దీన స్వరాలు శ్రుతి వేస్తున్నాయి. మీగానామృత సారాన్ని గ్రహించి సంతసించే జ్ఞానులకు బదులు అజ్ఞానులైన మేము ఆలకిస్తున్నాం.

రతిమన్మథుల ప్రణయ నృత్యం, పరమేశ్వరుని ప్రళయ నృత్యం, ప్రదర్శించగల నాట్యకళాప్రపూర్ణులైన మీరు దరిద్ర దేవతా తాండవాన్ని తిలకిస్తున్నారు.

అందమైన అతివల అంగసౌష్ఠవాన్ని, ఆరోగ్యవంతుల విగ్రహాల్ని సహజసౌందర్యాన్ని చిత్రించగల ప్రసిద్ధచిత్రకారులైన మీముందు ఆకలి బాధచే అలమటించే చిక్కి శల్యావస్థలోనున్న మాశరీరాలు, అనేకమైన అంటురోగాలకి నిలయమైన అనారోగ్యులైన మేమూ, మా జీవితాల్ని ప్రతిబింప జేసే పరిసర ప్రదేశాల్ని పరికిస్తున్నారు.

ఇహ లోకంతో సంబంధం లేకుండా పరలోకధ్యానచేసి పరమేశ్వర సాన్నిధ్యం పొందే పరమ పవిత్రులైన తత్వజ్ఞానులైన మిమ్మల్ని యీ మా పాపిష్టి ప్రపంచంలోకి తీసుకొచ్చాం.

మాకు ముక్తిమార్గం చూపించరూ! మమ్మల్ని విడిచి వెళ్ళిపోతారా! మమ్మల్ని మరచి పోతారా!

మంచి రకమే
రాణిస్తుంది




అందుచేతనే
జాబ్కో బ్రిలియన్ టైన్
ప్రఖ్యాతి గాంచింది